క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ తులసీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ పెనుమూరు, ఉగ్రాణంపల్లి, మఠంపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నగరి: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు అందరూ చేసి శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించుకున్నారు. స్థానిక కేవీకే మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ కలసి ఇలా క్రీడల్లో పాల్గొనడం మరచిపోలేని అనుభూతిని మిగిల్చిందన్నారు. ఇలా పోటీలు నిర్వహించడానికి సహకరించిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



బాలికలకు అభ్యసనా సామగ్రి అందజేస్తున్న నగరి డీఎస్పీ

వెదురుకుప్పం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నగరి డీఎస్పీ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో బాలికలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాలికలపై అఘాయిత్యాలు తరచూ జరుగుతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆత్మరక్షణ చేసుకోవాలన్నారు. అనంతరం అభ్యసనా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో ప్రదోషకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కం డ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోష కాల పూజలు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివునికి నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేకువజామునే కొండమల్లీశునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తిప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం నందీశ్వరుడిని పాలు, పెరుగు, పసుపు, కుంకుమతో అభిషేకించారు. ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మండల కన్వీనర్

నింద్ర: రాష్ట్రంలో రైతులు పడుతున్న బాధలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని రైతుల కోసం పోరాటం చేయకతప్పదని వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ వేణురాజు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా రైతులకు అందడం లేదన్నారు. దీంతో పంటలకు సకాలంలో ఎరువులు వేయకుంటే పంటలు సక్రమంగా ఎదగవని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రైతుల కోసం ఈ నెల 9వ తేదీన ఆర్డీఓ కార్యాలయం వద్ద ర్యాలీలో రైతులు పాల్గొని మద్దతు తెలపాలన్నారు. మండలం నుండి బయల్దేరి నగరిలో మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో జరిగే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. ఎంపీపీ దీప, జెడ్పీటీసీ పరంధామ, వైస్ ఎంపీపీ శుభ, మేరీ, అనిల్, విజేష్, శివయ్య, వీరయ్య, బాబురెడ్డి పాల్గొన్నారు.

బెండ సాగు.. ఆదాయం బాగు

కూరగాయల మార్కెట్‌లో 365 రోజులూ డిమాండ్ ఉన్న ఏకైక పంట బెండ. దీనికి సమయం, కాలం, నెలలు అవసరం లేదు. ఏ సీజన్‌లోనైనా ఈ సాగు చేసుకోవచ్చు. బెండకాయ మాత్రం అన్ని కాలాల్లోనూ సాగుకు అనుకూలమైంది. అంతే కాకుండా లాభదాయకం కూడా. ప్రస్తుత కాలంలో కూరగాయలు సాగు చేసే రైతులపాలిట వరంగా మారుతుంది. రుతువు ఏదైనా విరగకాసే ఈ పంటలో తక్కువ నీటితో అధిక దిగుబడి సాధించవచ్చు. –విజయపురం



విజయపురంలో సాగులో ఉన్న బెండ

- సంవత్సరమంతా డిమాండ్ ఉన్న పంట
- అన్ని కాలాల్లో సాగు చేయవచ్చు
- ఆసక్తి చూపుతున్న రైతులు

నగరి నియోజకవర్గంలో రైతులు అధికంగా బెండ సాగు చేసి లాభం పొందుతున్నారు. విజయపురం, నింద్ర, నగరి, పుత్తూరు, వడమాలపేట సుమారు 100 హెక్టార్లకు పైగా బెండ సాగులో ఉంది. తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన నగరి, విజయపురం మండలాల్లో అధికంగా బెండ సాగులో ఉంది. ఇక్కడ సాగు చేసిన కూరగాయలను పక్క రాష్ట్రం తమిళనాడులోని తిరుత్తణి, కోయంబేడు మార్కెట్లకు తరలిస్తుంటారు. మార్కెటింగ్, రవాణా సౌకర్యం ఉండడంతో రైతులు కూరగాయలు సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అందులో ఎక్కువగా బెండ సాగు చేస్తున్నారు.

మార్కెట్‌లో స్థిరమైన రేటు

బెండకాయలకు మార్కెట్‌లో ఎప్పుడూ స్థిరమైన రేటు ఉంటుంది. దీంతో చాలామంది రైతులు బెండ సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. తగిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. బెండ సాగులో మెళకువలు, సస్యరక్షణ చర్యలు తెలుసుకుంటే మంచి దిగుబడితోపాటు లాభాలు పొందవచ్చు.

అనుకూలమైన నేలలు

ఉదజని సూచిక 6.0 నుంచి 6.8 వరకు ఉండే నేలలు బెండ సాగుకు అనుకూలంగా ఉంటాయి. సేంద్రియ పదార్థాలతో సమృద్ధిగా ఉన్న వదులైన, మెత్తని, బాగా ఆరిన ఇసుక నేలల్లోనూ బెండ విరగకాస్తుంది. సారవంతమైన ఒండ్రు నేలలు, తేలికపాటి నల్లరేగడి నేలలు, గరుప నేలల్లోనూ అధిక దిగుబడి సాధించవచ్చు. అయితే, క్షార స్వభావం ఉన్న నేలలు, ఉప్పు నేలలు, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని నేలల్లో బెండ సాగు మంచిది కాదు. పంట వేయడానికి ముందే భూసార పరీక్షలు, నీటి నాణ్యత పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం.

బెండ రకాలు

బెండలో అనేక రకాలున్నాయి. అయితే వాతావరణానికి అనుకూలమైన రకాలను ఎంచుకోవడంతో ఎక్కువ దిగుబడులు పొందవచ్చు. మార్కెట్‌లో సుమారు 10 రకాల బెండ విత్తనాలు ఉన్నాయి. అందులో సాధారణంగా మన ప్రాంతాల్లో ఆకుపచ్చ బెండకాయ, ఎర్ర బెండ కాయలు ఎక్కువగా సాగులో ఉంది. ఆకుపచ్చ బెండకాయ రెండు రోజులకు ఒక సారి కోస్తారు. ఎర్ర బెండ కాయలు మూడు రోజులకు ఒక సారి కోస్తారు. అయితే ఎర్ర బెండకాయలో ఎక్కువ గుజ్జు ఉండడంతో పోషకాలు అధికంగా ఉంటుంది. ధర కూడా బాగుంటుంది.

కోత, దిగుబడి

బెండ విత్తనాలు వేసిన 45 నుంచి 55 రోజులకు మొదటి కోత వస్తుంది. 130 రోజుల వరకు దిగుబడిని ఇస్తుంది. ప్రతి రెండు మూడు రోజులకోసారి తప్పకుండా కాయలను కోయాలి. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే, ప్రతిరోజూ ఎకరానికి 100 కిలోల నుంచి 150 కిలోల వరకూ దిగుబడి వస్తుంది. మార్కెట్లో కనీస ధర కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకూ ఉన్నా, లక్షలకుపైగా ఆదాయం ఆర్జించవచ్చు.

విత్తనశుద్ధి

కిలో బెండ విత్తనానికి 5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్, తర్వాత 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడితో కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. నాటడానికి 24 గంటల ముందు ట్రైకోడెర్మా ఎస్పీపీ (4–10 గ్రా./ కేజీ విత్తనానికి), సూడోమోనాస్ ఎస్పీ (10 గ్రా./ కేజీ విత్తనానికి) సమపాళ్లలో కలుపుకొని, విత్తన శుద్ధి చేయాలి. వీటిని రాత్రంతా తడి ఆరనిచ్చి, మరుసటి రోజు విత్తుకోవాలి.

నేల తయారీ

హైబ్రీడ్ రకాలు ఎకరానికి ఒక కిలో చొప్పున, సాధారణ రకాలైతే ఎకరానికి రెండు నుంచి మూడు కిలోల చొప్పున అవసరం అవుతాయి. విత్తుకొనే ముందు భూమిని నాలుగైదుసార్లు కలియ దున్నాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి ఎనిమిది నుంచి పది టన్నుల పశువుల ఎరువు, 30 కిలోల భాస్వరం, పొటాష్ చొప్పున వేసుకోవాలి. సాళ్ల మధ్య 60 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన వెంటనే నీరు పెట్టి, నాలుగైదు రోజుల తర్వాత రెండో తడి ఇవ్వాలి. మొలకలు వచ్చిన తర్వాత పాదుకు ఒక మొక్కను ఉంచి, మిగతావి తీసేయాలి.

నీటి యాజమాన్య పద్ధతులు

బెండ సాగులో నీటి యాజమాన్య పద్ధతులను తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. విత్తనాలు విత్తిన వెంటనే నీరు పెట్టాలి. ఆ తర్వాత నేల రకం, వాతావరణ పరిస్థితులను బట్టి నీటి తడులు ఇవ్వాలి. నల్లరేగడి నేలల్లో అయితే ప్రతి ఐదారు రోజులకు నీరు అందించాలి. పూత, కాయ దశల్లో మొక్కలను నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి. లేకుంటే కాయ పరిమాణం, దిగుబడిపై ప్రభావం చూపుతుంది. ఒకవేళ నీరు తక్కువగా ఉన్నట్లయితే బిందు సేద్యం పద్ధతిని ఆశ్రయించడం మంచిది.

కలుపు నివారణ

ఇది దీర్ఘకాలపు పంట. పంట కాలంలో సుమారు మూడు నుంచి నాలుగుసార్లు కలుపు తీయాల్సి ఉంటుంది. విత్తనాలు వేసిన రెండు వారాలకు కలుపు నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఆ తర్వాత సమస్యను బట్టి కలుపును తొలగించుకోవాలి. తోట పూర్తిగా పెరిగే వరకూ మొక్కల వద్ద మట్టిని పారతో పైకి ఎగదోయాలి. కలుపు సమస్య, కూలీల సమస్య ఎక్కువగా ఉన్నప్పుడే రసాయన మందులు వాడాలి. కలుపు సమస్య ఎక్కువగా ఉండే నేలలైతే ఎకరానికి 100 లీటర్ల నీటిలో 500 మి.లీ. పెండిమిథాలిన్ కలిపి, విత్తనం నాటిన మరుసటి రోజే నేలపై పిచికారీ చేయాలి.

స్థిరమైన ఆదాయం

ఏడాది పొడవునా సాగయ్యే కూరగాయల పంట బెండ. నాలుగు నెలల కాలపరిమితి ఉండే ఈ పంటలో హైబ్రీడ్ రకాలు అందుబాటులోకి వచ్చాయి. అందుకే ఏడాది పొడవునా సాగు చేసుకోవచ్చు. మార్కెట్‌లో హైబ్రీడ్ రకాలు అందుబాటులో ఉండడంతో రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుంది. సకాలంలో పోషకాలు అందించి, తగిన మెళకువలు పాటిస్తే బెండలో మంచి దిగుబడి సాధించవచ్చు.



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న బెండ

విధి నిర్వహణలో అలసత్వం తగదు



ఏఎస్ఐ మునస్వామికి సన్మానం చేస్తున్న డీఎస్పీ, సీఐ

పాలసముద్రం: విధి నిర్వహణలో పోలీసులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని నగరి డివిజన్ డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ తెలిపారు. పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగినా, గంజాయి, మాదకద్రవ్యాలను సరఫరా చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ద్విచక్ర వాహనాలు నడిపే వారికి హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం రిటైర్డైన ఏఎస్ఐ మునస్వామి దంపతులను ఘనంగా సన్మానించారు. ఆయన విధి నిర్వహణలో చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ చిన్నరెడ్డప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి మోటారుకు మరమ్మతులు

నగరి: మున్సిపల్ పరిధి రామ్‌నగర్‌లో తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మహిళలు రాస్తారోకో చేయడంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రామ్‌నగర్‌లోని తాగునీటి మోటారుకు మరమ్మతులు చేపట్టి నీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.

ఘనంగా మిలాదున్‌నబీ వేడుకలు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని జామియా మసీదులో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం మిలాదున్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రవక్త చూపించిన సన్మార్గాన్ని జీవితాంతం ఆచరించాలని ప్రార్థించారు. మసీదు ఆవరణలో నిర్వాహకులు పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ నేతకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్ఆర్ సీపీ సమన్వయ కర్త కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పంచాయతీ 50 బసివిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు బి.నరసింహులు గురువారం అనారోగ్యంతో మరణించారు. సమాచారం అందుకున్న గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి 50 బసివిరెడ్డిపల్లి గ్రామంలో నరసింహులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నరసింహులు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, స్థానిక సర్పంచ్ వరదమ్మ, ఎంపీపీ సరిత జనార్దన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కాళప్ప, జిల్లా క్రియాశీలక కార్యదర్శి విజయబాబు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, మండల రైతు విభాగం అధ్యక్షుడు సుబ్బనాయుడు, నాయకులు నరసింహులు, మాజీ సర్పంచ్ బాబు, కోటిరెడ్డిబాబు, శ్యామ్, హరిరెడ్డి, దొరస్వామి, గోవిందస్వామి, కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రసన్నుడి కల్యాణం కమనీయం



ఉభయ దేవేరులను కల్యాణమాడిన ప్రసన్న వేంకటేశ్వరుడు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణాన్ని పురస్కరించుకొని శుక్రవారం వేదపండితులు శాస్త్రోక్తంగా కళ్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యుల బృందం ముందుగా గణపతి హోమం నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణ మధ్య మాంగల్యధారణను కమనీయంగా నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మా రోడ్డుకు మోక్షమెప్పుడో ?

కార్వేటినగరం: ''మా రోడ్డుకు మోక్షం ఎప్పుడు'' అంటూ మండల పరిధిలోని అన్నూరు పంచాయతీ ఇందిరాకాలనీ వాసులు వాపోతున్నారు. పంచాయతీలోనే కాదు నియోజకవర్గంలో ఇలాంటి దుస్థితి ఎక్కడ ఉండదని అంటున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన రోడ్లు, వీధులు సీసీ రోడ్లతో మెరిసిపోతున్న తరుణంలో ఎమ్మెల్యే థామస్ స్వగ్రామం అల్లాగుంట గ్రామానికి సంబంధించిన ఇందిరా కాలనీకి వెళ్లే రోడ్డు ఇప్పటికీ మట్టి రోడ్డుగా దర్శనమిస్తోంది. గత రెండు వారాలుగా ఎడతెరపీ లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని, గ్రామంలోని పిల్లలు పాఠశాలకు వెళ్లడానికి నిరాకరిస్తున్నారని అంటున్నారు. ప్రైవేటు పాఠశాల నుంచి వచ్చే బస్సులు కూడా రాకపోవడంతో కిలోమీటరు దూరంలో ఉన్న జాతీయ రహదారికి ద్విచక్ర వాహనాల ద్వారా తీసుకురావాల్సి వస్తోందని మళ్లీ సాయంత్రం వారి కోసం రోడ్లపై వేచి చూడాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి ఇందిరా కాలనీకి వెళ్లే మట్టి రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



బురదమయంగా ఇందిరా కాలనీ మట్టి రోడ్డు

వైఎస్ఆర్ సీపీ నాయకుడి కృషితో రోడ్డుకు మరమ్మతులు



గుంతలను చదును చేస్తున్న యువత

వెదురుకుప్పం: దెబ్బతిన్న రోడ్డును ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకుడు చొరవ తీసుకున్నాడు. తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి గుంతలమయమై వాహనచోదకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే అటుగా అధికారులు ప్రయాణిస్తున్నా రోడ్డు దుస్థితిని పట్టించుకోకపోవడంతో వైఎస్ఆర్ సీపీ వైద్య విభాగం గంగాధరనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్ స్పందించారు. తాత్కాలికంగా రోడ్డు మరమ్మతు పనులు చేయించాడు. స్థానిక యువత ఆధ్వర్యంలో గుంతలను పూడ్చి చదును చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు శాశ్వత చర్యలు తసుకోవాలని కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు అవార్డులు



అవార్డు అందుకుంటున్న చంద్రశేఖర్

చిత్తూరు కలెక్టరేట్: అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు.



సుందరేషన్, రేవతి, గోవిందరెడ్డి



హేమలత, జ్యోతి, ప్రసన్నకుమారి, మధు, విజయ, కమలాపతి, ఆనందయ్య

ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రశంస



క్రీడాకారులను సన్మానిస్తున్న మండల బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

నగరి: రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టులోని క్రీడాకారులను నగరి బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు శుక్రవారం ప్రశంసించారు. ఈ సందర్భంగా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఎంపీ రవిబాబు మాట్లాడుతూ నగరి నుంచి క్రీడాకారులు వరుసగా తమ ప్రతిభను కనబరుస్తూ జాతీయస్థాయిలో ప్రతిభ చాటుతూ వస్తున్నారన్నారు. ఈ ఏడాది సబ్‌జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు లక్ష్మీనరసింహారెడ్డి అనే క్రీడాకారుడు ఎంపికయ్యాడన్నారు. క్రీడాకారులను ఆయన అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి నిజాం, డాక్టర్ ఆర్‌వీ మంజులు, క్రీడాకారులు తేజేష్, ఇజాజ్, రితి, జశ్వంత్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలకు పురస్కారం



అవార్డును స్వీకరిస్తున్న ఎస్వీ కుమార్

పుత్తూరు: విద్యా రంగంలో విశిష్ట సేవలందించినందుకు పుత్తూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డును ఆయన అందుకున్నారు.

కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో కలపాలి



కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కార్వేటినగరం: తుడా పరిధిలో ఉన్న కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని నాయకులు, యువత తుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు డాలర్స్ దివాకర్‌రెడ్డికి విన్నవించారు. కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో శుక్రవారం ఈ వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి జిల్లాకు సమీపంలో ఉంటూ, తుడా పరిధిలో కొనసాగుతూ టీటీడీకి అనుబంధ ఆలయాలతో పవిత్ర యాత్ర స్థలంగా పేరుగాంచిన కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపి మండలవాసులకు న్యాయం చేయాలన్నారు. గతంలో బాదుడే-బాదుడు కార్యక్రమానికి అప్పటి ప్రతిపక్ష నాయకుడు, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన రోడ్‌షోలో కూడా కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చుతానని హామీ ఇచ్చారని ఆయనకు వివరించారు. స్పందించిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించండి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అన్బలగన్

పాలసముద్రం: హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, ఎంపీటీసీ గోవిందరాజ్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రంలో పార్టీ కార్యకర్తలతో అన్బలగన్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడు నైజమన్నారు. వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. శ్రీరంగరాజుపురంలో నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ జరుగు నున్న బైక్ ర్యాలీని మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు అయ్యప్ప, గాలి మహేష్‌బాబు, పద్మనాభనాయుడు, నరసింహనాయుడు, కుమార్ నాయుడు, షణ్ముగరెడ్డి, క్రిష్ణయ్య, రాజామణి, వేణు, బాబు, మనోహర్, ప్రేమ్‌కుమార్, గోపాల్, కుట్టి (అంబేడ్కర్) తదితర నాయకులు పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మించండి

విజయపురం: మండలంలోని గంగమాంబపురంలో మురికి కాలువ నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 200 పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అన్ని వీధుల్లో సిమెంట్ రోడ్లు ఉన్నాయి. మురికి కాలువ లేవు. ఫలితంగా వర్షాకాలంలో నీళ్లు ముందుకు కదలడం లేదు. సిమెంట్ రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. వృద్ధులు, పిల్లలు సైతం కాలుజారీ కింద పడుతున్నారు. దీర్ఘకాలంగా నీళ్లు నిలిచి ఉండడంతో పాచి పట్టి దోమలకు నిలయంగా మారింది. మురికి కాలువ నిర్మించి సమస్య పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కొలువుదీరిన వినాయకుడు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులోని కట్టమంచిలో శుక్రవారం వినాయకుని కొలువుదీర్చారు మండపంలో స్వామికి పూజలు చేసి హారతులిచ్చారు. ఈ పూజా కార్యక్రమానికి వైఎస్ఆర్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త డీసీ విజయానందరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చుడా మాజీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు ఏపీ శ్రీధర్, కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు శివారెడ్డి, మనోహర్ రెడ్డి, బాబు, బుజ్జి, సోమిరెడ్డి, మనోజ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సిద్ధ, రెడ్డిసాయి తదితరులు పాల్గొన్నారు.